సాక్షి
అనకాపల్లి
బుధవారం । 28 । ఫిబ్రవరి । 2024



విక్రాంత్.. విక్రమాదిత్య.. విశాఖ
ఐఎన్ఎస్ విక్రాంత్, విక్రమాదిత్య ఎంత విలువైనవో.. తూర్పు తీరానికి విశాఖ అంతే విలువైందని పలువురు ప్రశంసించారు. 8లో



అప్పన్నకు ఆర్జిత సేవలు
శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో

వాతావరణం
అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 32.5 డిగ్రీలు, తేమ 68 నుంచి 73 శాతం నమోదవుతాయని, గాలి గంటకు 5 నుంచి 8 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

నేడు సీఎం విశాఖ రాక



మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ రానున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి.. మధ్యాహ్నం 4.25 గంటలకు బీచ్‌రోడ్డులోని నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిప్యాడ్‌లో దిగుతారు. 4.25 నుంచి 4.30 గంటల వరకు ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. 4.30 గంటలకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు బయలుదేరుతారు. అక్కడ జరిగే డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కుమారుడి వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. నూతన వధూవరులను ఆశీర్వదించి.. తిరిగి కోస్టల్ బ్యాటరీ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5 గంటలకు అక్కడ నుంచి విశాఖ విమానాశ్రయానికి బయలు దేరుతారు. 5.20 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్తారు.

తొలిరోజు టెట్‌కు 86.80 శాతం హాజరు



చినముషిడివాడ కేంద్రంలో పరీక్షకు హాజరైన అభ్యర్థులు


విశాఖ విద్య: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్–2024) మంగళవారం ప్రశాంతంగా జరిగింది. తొలిరోజు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ఏడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,420 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వీరిలో 3,837 మంది హాజరయ్యారు. దీంతో 86.80 శాతం మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖాధికారులు వెల్లడించారు. టెట్ పరీక్ష నిర్వహణపై విస్తృత ప్రచారం చేయటంతో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకున్నారు. సిబ్బంది అభ్యర్థుల హాల్ టికెట్, తగిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించిన తరువాతనే లోపలికి పంపించారు. పరీక్ష సజావుగా జరిగేలా అన్ని పరీక్షల కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పరీక్షల జిల్లా అబ్జర్వర్, ప్రత్యేక అధికారి బి.విజయ భాస్కర్ చినముషిడివాడ కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, కేంద్రంలో ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ రెండు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మరో రెండు కేంద్రాలను తనిఖీ చేశారు. షెడ్యూల్ మేరకు మార్చి 6 వరకు పరీక్షలు జరుగుతాయి. పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ దగ్గర నోబెల్ స్కూల్లోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలకుడు విజయ భాస్కర్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. మంగళవారం తొలి రోజు 168 (ఉదయం 86 మంది, మధ్యాహ్నం 82 మంది) విద్యార్థులు హాజరయ్యారు.

నేడు రైతు భరోసా, పీఎం కిసాన్ నగదు జమ

- నున్నా వడ్డీ, పంట రుణాల పంపిణీ కూడా..

తుమ్మపాల: వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ ఐదో విడత నగదు జమ, మూడో విడత సున్నా వడ్డీ పంట రుణాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాడేపల్లి క్యాంప్ ఆఫీసు నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. జిల్లాలోని 2,65,886 మంది రైతులు(భూయజమానులు, కౌలు రైతులు, ఆర్వోఎఫ్ఆర్, ఎండోమెంట్) ఖాతాలకు రూ.53.32 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాలు రూ.6.90 కోట్లు నేరుగా జమ చేస్తారన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతి హాజరవుతారని తెలిపారు. ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులు వీక్షించుటకు ఏర్పాట్లు చేశామన్నారు.

ఆవగింజలతో సి.వి.రామన్ చిత్రం



మాకవరపాలెం: తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ ఆవగింజలతో సి.వి.రామన్ చిత్రపటాన్ని తయారు చేశాడు. సర్ సి.వి.రామన్ జయంతి రోజైన బుధవారం నేషనల్ సైన్స్ డే పాటిస్తున్న సందర్భంగా ఆవగింజలతో రామన్ చిత్రపటాన్ని రూపొందించాడు. ఈ చిత్రాన్ని తయారు చేసేందుకు 817 ఆవగింజలను వినియోగించానని రవికుమార్ తెలిపాడు.

బాబోరా.. మజాకా

- ఫిరాయింపుదారులపై చంద్రబాబు ట్రిక్స్
- అదే బాటలో దత్తపుత్రుడు పవన్ కల్యాణ్
- అడకత్తెరలో పోకచెక్కలా వైఎస్సార్ సీపీ నుంచి వెళ్లిన వారి పరిస్థితి
- తొలి జాబితాలో ఒక్కరి పేరూ లేకుండా చేసిన బాబు ద్వయం
- దాడి, పంచకర్ల, వంశీకృష్ణ, కార్పొరేటర్లకు హ్యాండిచ్చినట్లేనా.?
- చంద్రబాబు గురించి తెలిసి కూడా మోసపోయామంటూ నేతల ఆక్రోశం
- తమ రాజకీయ భవిష్యత్ నాశనమైపోయినట్లేనంటూ ఆవేదన



‘సార్.. పార్టీలో చేరితే టికెట్ కన్ఫర్మ్ అన్నారు.. మీరు సీనియర్లు కదా.. మీకే ఫస్ట్ ప్రియారిటీ అని చెప్పారు.. కానీ.. ఫస్ట్ లిస్ట్‌లో మా పేర్లు కనిపించలేదెందుకు..?’

‘చెప్పాను కదా.. మీరు సీనియర్లు అని.. ఆ మూలన నిల్చోండి.. మీ సంగతి తర్వాత చూద్దాం..’

ఇదీ సంగతి..

సాక్షి, విశాఖపట్నం : ‘వైఎస్సార్ సీపీలో అత్యుత్తమ పదవులు అనుభవించారు. పోటీ చేసిన ప్రతిసారీ ఓడిపోయినా.. చట్టసభలకు పంపించారు. రాజకీయ భవిష్యత్‌కు అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అయినా ఇంకా ఏదో ఆశించారు. పరుగెత్తి పాలు తాగేద్దాం అనేలా.. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ వ్యామోహంలో పడిపోయారు. సీనియర్లుగా మనకు పెద్ద పీట వేస్తారని ఊహల్లో తేలిపోయారు. ఇక ఇక్కడ మేం ఏం చెప్తే అదే జరుగుతుంది.. మన ప్రాంతాన్ని మనమే శాసించే స్థాయికి ఎదిగిపోతున్నామని పగటి కలలు కన్నారు’. కానీ.. ఆ కలలన్నీ చంద్రబాబు వెన్నుపోటుతో పటాపంచలైపోయాయి. శాసిస్తామనుకున్న వాళ్లంతా.. సైడ్ క్యారెక్టర్స్‌గా మారిపోయారు.

వంశీ.. ఏదో అనుకుంటే..

పార్టీ పెట్టినప్పటి నుంచి చంద్రబాబుతోనే ప్రత్యక్షంగా, పరోక్షంగా పయనిస్తూ చెట్టపట్టాలేసుకుని తిరుగుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కి కూడా.. బాబు లక్షణాలు వంటబట్టాయి. తనని నమ్ముకుని పార్టీలోకి వచ్చిన వారి భవిష్యత్తుని గాలిలో దీపం మాదిరిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా జనసైనికులు పవన్ పొత్తు వైఖరిని దుమ్మెత్తి పోస్తున్నారు. విశాఖలోనూ ‘తూర్పా’రబడుతున్నారు. తూర్పు టికెట్ నీకే.. వచ్చేసెయ్ అంటూ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానించేశారు. 2014లో వైఎస్సార్ సీపీ తరపున టికెట్ ఇస్తే వంశీ ఓటమి పాలయ్యారు. అయినా వైఎస్ జగన్ అక్కున చేర్చుకుని పార్టీ నగర అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చారు. అనంతరం జీవీఎంసీ కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే.. అతి కష్టంమీద నెగ్గుకొచ్చారు. అయినా జగన్ మాత్రం సోదరుడిలా భావించి.. ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. ఇలా అన్ని విధాలుగా వైఎస్సార్ సీపీ అండగా ఉన్నా.. ఏదో ఆశించి జనసేనలో చేరారు. తొలుత తూర్పు టికెట్ కన్ఫర్మ్ అని చెప్పి.. తర్వాత.. దక్షిణ.. భీమిలి.. గాజువాక ఇస్తామని ఎప్పటికప్పుడు మాట మార్చుతుండటంతో వంశీ ఆలోచనలో పడ్డారు. నగర అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించిన వంశీ వెంట ఒక్క సీనియర్ నాయకుడు కూడా వెళ్లకపోవడంతో ఆయన సామర్థ్యమేంటో పవన్‌కి తెలిసిందనీ.. అందుకే దూరం పెడుతున్నట్లు సమాచారం.

కార్పొరేటర్లదీ అదే బాధ

దక్షిణ టికెట్ నాదేనంటూ.. 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు జనసేనలో చేరిన మొదటి రోజు హడావిడి చేశారు. తర్వాత ఇప్పుడు ఎక్కడున్నారో కూడా తెలియని స్థితికి చేరుకున్నారు. దక్షిణ నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి నేనేనంటూ వెళ్లిన 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్‌ది కూడా అదే పరిస్థితి. అదేవిధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పిస్తే.. కుళ్లు రాజకీయాలతో పార్టీకి రాజీనామా చేసిన సీతంరాజు సుధాకర్ పరిస్థితి ఎడారిగా మారింది. ఏ పార్టీలోకి వెళ్లినా సీటు లేదంటూ తరిమేస్తుండటంతో తన రాజకీయ భవిష్యత్‌కి ఎండ్ కార్డ్ పడిందంటూ వాపోతున్నారు.

కన్నీళ్లు పెట్టుకుంటున్న క్యాడర్

అన్ని విధాలా ఆదుకున్న పార్టీకి ద్రోహం చేసి.. చంద్రబాబు వలలో చిక్కుకొని విలవిల్లాడుతున్న నాయకుల వెంట ఉన్న క్యాడర్ పరిస్థితి దారుణంగా మారింది. నేతలను నమ్ముకొని వెంట నడిస్తే.. తమ భవిష్యత్‌ని కూడా వాళ్లతో పాటే రోడ్డున పడేశారంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కులం, మతం, రాజకీయం చూడకుండా.. పథకాలు అందించిన వైఎస్సార్ సీపీ బెస్ట్ అనీ.. అనవసరంగా రాజకీయ ఉచ్చులోకి తీసుకొచ్చేశారంటూ ఆవేదన చెందుతున్నారు.

‘దాడి’కి రిక్త హస్తాలు

ఎన్నికల వేళ టీడీపీలోకి వెళ్లిన జంప్ జిలానీలు పరిస్థితి చూస్తే అందరికీ జాలి కలుగుతోంది. సొంత కుటుంబంలా చూసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కాదని.. ఏరు దాటాక తెప్ప తగలేసే చంద్రబాబు, ఆయన్ని అంటకాగుతున్న పవన్ కల్యాణ్ పార్టీలో చేరిన వారంతా ఇప్పుడు డైలమాలో పడిపోయారు. సీనియర్ నేత దాడి వీరభద్రరావు కుటుంబానికి వైఎస్సార్ సీపీ సముచిత స్థానాన్ని కల్పించింది. ఈ ఎన్నికల్లో కూడా మంచి పదవులు ఇవ్వాలని భావించినా.. తొందరపడి చంద్రబాబు పంచన చేరారు. అమరావతి గ్రాఫిక్స్ మాదిరిగా.. వారికి భరోసా ఇస్తానంటూ సినిమా చూపించిన బాబు.. అనకాపల్లి టికెట్‌ని జనసేనకు అప్పగించేశారు. దీంతో దాడి కుటుంబం అయోమయంలో పడిపోయింది. పోనీ ఎంపీ స్థానమైనా ఇస్తారా అంటే.. అది కూడా జనసేన ఖాతాలోకే పంపించాలని బాబు వ్యూహం పన్నారు. దీంతో తమకు రిక్త హస్తాలు చూపించారంటూ అనుచరుల దగ్గర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలి జాబితాలో పేరు లేకపోవడంతో కుటుంబమంతా మౌనముద్రలోకి వెళ్లిపోయారు. ఫస్ట్ లిస్ట్ కంటే ముందు లోకేష్ అనకాపల్లిలో శంఖారావం నిర్వహించగా.. అన్నీ తామే అన్నట్లుగా సభలో దాడి ఫ్యామిలీ వ్యవహరించింది. అయితే వారి గురించి లోకేష్ పల్లెత్తు మాట కూడా అనకపోవడంతో అవమానంగా భావించినట్లు సమాచారం. జగనే మేలు చెప్పినట్లే చేస్తారు.. ఈయన చెప్పిన మాట ఒకటి.. చేసిన పని ఒకటి.. ఇప్పుడు ఎటూ చెందకుండా అయిపోయామంటూ సన్నిహితుల వద్ద ఆక్రోశం వెళ్లగక్కినట్లు తెలుస్తోంది. తమ రాజకీయ భవిష్యత్ ఏమిటనేది ఎటూ తేల్చుకోలేక.. అడకత్తెరలో పోకచెక్క మాదిరిగా తయారైందని దాడి అండ్ కో మదనపడుతున్నారు.

పంచకర్లకు కుంపటి

వైఎస్సార్ సీపీలో చేరిన వెంటనే విశాఖ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించి.. పంచకర్ల రమేష్‌బాబుకు వైఎస్ జగన్ సముచిత స్థానాన్ని కట్టబెట్టారు. ఈ ఎన్నికల్లోనూ సీట్ పక్కాగా ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అయినా తొందరపడి జనసేన కండువా కప్పుకున్న పంచకర్ల.. ఇప్పుడు ‘గ్లాసు’లో ఇరుకున్నారు. పెందుర్తి నియోజకవర్గ బాధ్యతలు పవన్ అప్పగించడంతో గొప్పలు పోయిన పంచకర్లకు ఇప్పుడు చుక్కలు కనిపిస్తున్నాయి. సొంత పార్టీలోనే శివశంకర్ అనే కుంపటి రగులుతుండగా.. పొత్తులో భాగంగా పెందుర్తి టికెట్ పంచకర్లకు ఇస్తే ఖబడ్దార్ అంటూ టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణ అధినేతకు అల్టిమేటం జారీ చేశారు. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. తొలి జాబితాలో పేరు లేకపోవడంతో పంచకర్ల అయోమయానికి గురవుతున్నారు. వైఎస్సార్ సీపీలో ఉంటే కచ్చితంగా టికెట్ వచ్చేదనీ.. ఇప్పుడు వస్తుందో రాదో అనేది డౌటేనంటూ సన్నిహితులతో వాపోతున్నట్లు తెలుస్తోంది.

ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా సూర్యనారాయణరాజు



సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సూర్యనారాయణరాజు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా దాట్ల వెంకట సూర్యనారాయణరాజు (సూరిబాబు రాజు) నియమితులయ్యారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ స్థానంలో విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఉన్నారు. కాగా సూరిబాబు రాజుకు 2009లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సూరిబాబు రాజు రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షునిగా పనిచేశారు. ఈ సందర్భంగా సూరిబాబు రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనకు ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానన్నారు. ఎంఎస్ఎంఈ రంగం మరింత బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు చైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపార సంస్థలు రేపటిలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

తుమ్మపాల: ఈ నెల 29వ తేదీలోగా జిల్లాలోని అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం ప్రాంతాల్లో గల అన్ని వ్యాపార సంస్థలు రిజిస్ట్రేషన్ చేయించుకొని, లైసెన్స్ పొందాలని సహాయ కార్మిక కమిషనర్ కె.వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వ్యాపార యాజమాని సమీప గ్రామ సచివాలయం, మీ సేవ కేంద్రంలో విధిగా కొత్త రిజిస్ట్రేషన్, లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

గోవాడ రైతులకు చెరకు చెల్లింపులు

- మొదటి విడతగా రూ.8.75 కోట్లు
- నేటి నుంచి రైతుల ఖాతాల్లోకి జమ
- ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు వెల్లడి

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతులకు చెరకు పేమెంట్స్ చెల్లించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈనెల 28వ తేదీన మొదటి విడతగా రూ.8 కోట్ల 72 లక్షలు రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నట్టు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు. 2023–24 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి చెరకు సరఫరా చేసిన 4936మంది రైతులకు మొదటి విడతగా చెరకు చెల్లింపులు ఇస్తున్నామని ఆయన చెప్పారు. గతేడాది డిసెంబరు 29 నుంచి ఈ ఏడాది జనవరి 15 వరకు చెరకు సరఫరా చేసిన రైతులకు ఈ చెల్లింపులు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది సీజన్‌లో 2 లక్షల టన్నులు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు లక్షా 38 వేల 100 టన్నులు క్రషింగ్ చేసి లక్షా 13 వేల 823 క్వింటాళ్ల పంచదారను ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. మిగతా క్రషింగ్ కూడా పూర్తిచేసి లక్ష్యం చేరాలని భావిస్తున్నామన్నారు. మార్చి 5వ తేదీ వరకు గానుగాడాలని నిర్ణయించామన్నారు. ఇంకా రైతుల దగ్గర చెరకు ఉంటే క్రషింగ్ ముగింపు తేదీ అవసరమైతే మారుస్తామని ఆయన చెప్పారు. ఇప్పటి వరకు సరాసరి రికవరీ 9.04 రాగా రోజువారి రికవరీ 10 శాతం వచ్చిందన్నారు. ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన కరెంటును ఏపీ ట్రాన్స్‌కోకి 12 లక్షల 16 వేల 600 యూనిట్లు అమ్మామని ఎండీ చెప్పారు.

కేంద్రం నిర్ణయించిన చెరకు మద్దతు ధర టన్నుకు రూ.3,151 కాగా గతేడాది కంటే ఈ ఏడాది టన్నుకు రూ.231 మద్దతు ధర పెరిగిందని ఎండీ చెప్పారు. చెరకు సరఫరా చేయడంలో ఫ్యాక్టరీ సభ్య రైతులు చూపుతున్న చొరవ వల్లే క్రషింగ్ ఆశించిన మేర జరుగుతుందని ఆయన చెప్పారు. రైతులకు కటింగ్ పర్మిట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా వారి ఫోన్లకే మెసేజ్‌ల ద్వారా సమాచారం అందిస్తున్నామన్నారు.

ఇంటర్ పరీక్షలకు 28,621మంది విద్యార్థులు

- 1 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు

అనకాపల్లి: ఈ ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లాలో 28,621మంది విద్యార్థులు హాజరవుతారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) బి.సుజాత మంగళవారం ఓ ప్రకటనలో అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని, విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటలకు చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు. 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 29, పట్టణ ప్రాంతాల్లో 9 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులు 10,704 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,619మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 12,708మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,590మంది పరీక్షలు రాస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహిస్తామని ఆమె తెలిపారు.



నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

‘స్ట్రాంగ్’గా ఎన్నికల ఏర్పాట్లు

- జిల్లాలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ
- నర్సీపట్నం, నక్కపల్లి, యలమంచిలిలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ



నర్సీపట్నంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి బయటకు వస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

నర్సీపట్నం/నక్కపల్లి/యలమంచిలి: రానున్న సార్వత్రిక ఎన్నిలకు ముందస్తు ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఎస్పీ కె.వి.మురళీకృష్ణతో కలిసి నర్సీపట్నం, నక్కపల్లి, యలమంచిలిలో పర్యటించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పోలింగ్ సామగ్రి భద్రత, డిస్ట్రిబ్యూషన్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్రణాళికయుతంగా పనులను విభజించి అనుభవజ్ఞులైన అధికారులు, సిబ్బంది సలహాలతో పొరపాట్లకు అవకాశం లేకుండా విధులు నిర్వర్తించాలని అధికారులకు సూచించారు. ఈవీఎంలను భద్రపరిచే నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాంను ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ, విద్యుత్ సరఫరా తదితర సౌకర్యాలు పక్కాగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం మరమ్మతులు చేపడుతున్న ఆర్ అండ్ బీ బంగ్లాను పరిశీలించి, త్వరతగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్పీ మురళీకృష్ణ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర పారామిలిటరీ బలగాలను వేసుకోవాలని టౌన్ సీఐ కాంతికుమార్‌ను ఆదేశించారు. ఈఆర్వో గీతాంజలితో కలసి కలెక్టర్, ఎస్పీ నక్కపల్లి ప్రభుత్వ జూనియర్‌కళాశాలలోని స్ట్రాంగ్‌రూములు పరిశీలించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ అంతా నక్కపల్లి కేంద్రంగా జరుగుతుంది. ఈవీఎంలను భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్‌రూములను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. యలమంచిలి పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అన్ని వసతులతో కూడిన గదుల్లో కిటికీలు, తలుపులు అధునాతనమైన రూములను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్, నక్కపల్లి తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు, సీఐ విజయ్‌కుమార్, యలమంచిలి మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, యలమంచిలి సీఐ షేక్ గఫూర్, ఎస్సైలు పాపినాయుడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పలురైళ్ల రీ షెడ్యూల్ 8లో

కాయకల్ప బృందం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి సందర్శన

నర్సీపట్నం: కాయకల్ప బృందం ప్రతినిధులు మంగళవారం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఇప్పటికే స్టేట్ బృందాలు రెండు పర్యాయాలు ఏరియా ఆస్పత్రిని సందర్శించి ఇక్కడి సౌకర్యాలు, అందుతున్న వైద్య సేవలపై నివేదిక సమర్పించాయి. ఫైనల్‌గా కాయకల్ప కేంద్రం ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసవర్మ, డాక్టర్ రూపేశ్ పాల్, ఆశ ఏరియా ఆస్పత్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అత్యవసర విభాగం, ప్రసూతి సేవల విభాగం, వార్డులు, ఆస్పత్రిలో శానిటేషన్, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెండ్ ఎం.నీలవేణిదేవిని పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. 2023–24 కాయకల్ప అవార్డుకు సంబంధించి బృందం రావటం జరిగిందని సూపరింటెండెంట్ తెలిపారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణిదేవిని ఆస్పత్రిలో సేవలపై ఆరా తీస్తున్న కాయకల్ప బృందం

విసన్నపేటలో నేడు క్షేత్ర స్థాయి సర్వే

- వివాదాస్పద భూములను పరిశీలించిన ఉన్నత స్థాయి కమిటీ
- నిజాలు నిగ్గు తేలుస్తాం: స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి



వివాదాస్పద విసన్నపేట భూముల రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి, ఇతర అధికారులు

కశింకోట: విసన్నపేట వద్ద ఉన్న వివాదాస్పద భూముల వ్యవహారంలో వాస్తవాలను వెలికితీయడానికి కలెక్టర్ నియమించిన ఉన్నత స్థాయి కమిటీ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి ఆధ్వర్యంలో 9 మంది ఉన్నతాధికారులతో కూడిన కమిటీ బయ్యవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 195–2లో ఉన్న 609 ఎకరాల భూముల రికార్డులను పరిశీలించింది. దీనిలో 49 ఎకరాలను జమాదులపాలెం–పరవాడపాలెం మధ్య ఉన్న రంగబోలు గెడ్డ జలాశయానికి భూసేకరణలో కేటాయించారు. మిగిలిన భూముల్లో సుమారు 285 ఎకరాల మేర ఈనాం భూములున్నాయి. అవి ఎలా దఖలు పడ్డాయి, ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయనే విషయమై పరిశీలన జరిపారు. మిగిలిన 175 ఎకరాల్లో వ్యవసాయయోగ్యమైన మూడు కొండలు, రంగబోలు గెడ్డ జలాశయానికి వెళ్లే కొండవాగుల పూడ్చి వేత, దీనివల్ల జలాశయానికి చేరాల్సిన నీరు ఏ మేరకు నష్టపోయే పరిస్థితి ఉందనే విషయాలను అధికారులు కులంకషంగా చర్చించారు. బుధవారం నుంచి క్షేత్ర స్థాయిలో సర్వేయర్లతో సర్వే జరిపించి, వివాదాస్పదమైన భూముల వ్యవహారంలో నిజాలను నిగ్గు తేల్చి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి తెలిపారు. 1957 నుంచి భూముల లావాదేవీలు జరిగాయని, వ్యవహారాలు ఎలా జరిగాయి.. ఎంతమందికి పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చారనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. రికార్డులు, క్షేత్ర స్థాయిలో పరిస్థితులను తమ కమిటీ పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. బయ్యవరం రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 195–2లో కొందరు వ్యక్తులు అనుమతి లేకుండా లే– అవుట్ వేసి ప్లాట్లు అమ్మడం, నాలా కన్వర్షన్ లేకపోవడం, అనధికారికంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి రోడ్లు వేయడం, తదితర అభియోగాలు ఉన్నాయని, వీటిపై కమిటీ విచారించి తదుపరి చర్యల కోసం రెండు వారాల్లోగా నివేదించాలని జేసీ ఎం.జాహ్నవి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో ఆదేశించినట్టు చెప్పారు. ఈ కమిటీలో జిల్లా రిజిస్ట్రార్ సిహెచ్.జానకీదేవి, నీటిపారుదలశాఖ ఏఈ కె.సూర్యకుమార్, పర్యావరణ ఇంజనీర్ జి.నాగిరెడ్డి, ఉప తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

డిఫెన్స్ అండ్ మారిటైమ్ పార్క్ ఏర్పాటుకు వినతి

బీచ్‌రోడ్డు: విశాఖపట్నంలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈల కోసం డిఫెన్స్ అండ్ మారిటైమ్ పార్క్ ఏర్పాటు చేయాలని కేంద్రరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ సభ్యులు కోరారు. సిరిపురంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖపట్నంలో తూర్పు నౌకాదళ ప్రధాన కార్యాలయం, కేంద్ర విద్యా సంస్థలైన ఐఐఎం, ఐఐపీఈ, విశాఖ పోర్టు, గంగవరం పోర్టులు ఉన్నాయన్నారు. గ్లోబల్ హబ్‌గా విశాఖను మార్చడానికి డిఫెన్స్ అండ్ మారిటైమ్ పార్క్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చాంబర్ సభ్యులు సుధీర్, చిట్టూరి శ్రీనాథ్, కృష్ణప్రసాద్, కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.



కేంద్రరక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ సభ్యులు

క్లుప్తంగా

16న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట : జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో మార్చి 16వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ శేషమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత మార్చి 9న ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేసినప్పటికీ మహా శివరాత్రి పర్వదినం, వరుసగా ప్రభుత్వ సెలవులు రావడంతో 16వ తేదీకి మార్పు చేసినట్లు పేర్కొన్నారు. కక్షిదారులు ఈ మార్పును గమనించి హాజరు కావాలని ఆమె కోరారు. జిల్లాలోని న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాలు తదితర కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో లేదా 0891 – 2560414, 2575046 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

‘ఉక్కు’లో బయోమెట్రిక్ వివాదం

- డైరెక్టర్ చాంబర్ ముట్టడి
- కొనసాగుతున్న కార్మికుల నిరసన



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌లోని డైరెక్టర్ చాంబర్‌లో చర్చిస్తున్న నాయకులు

ఉక్కునగరం: బయోమెట్రిక్ అంశం మంగళవారం స్టీల్‌ప్లాంట్‌లో వివాదానికి దారి తీసింది. డైరెక్టర్ (పర్సనల్) చాంబర్‌ను కార్మిక నాయకులు ముట్టడించారు. దీంతో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ పరిసరాల్లో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్లాంట్‌లో బయోమెట్రిక్ అమలు అంశంపై ఉక్కు యాజమాన్యం శనివారం కార్మిక నాయకులతో సమావేశమైంది. ఈ సమావేశంలో నాయకులు బయోమెట్రిక్‌కు తాము వ్యతిరేకంగా కాదని అయితే కార్మికుల వేతన సవరణ, క్యాంటిన్, టాయిలెట్లు, భద్రతా పరిస్థితులు మెరుగు వంటి సమస్యలు పరిష్కరించిన తర్వాతే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకుల డిమాండ్లను పరిగణలోకి తీసుకోకుండా యాజమాన్యం మార్చి 8 నుంచి బయోమెట్రిక్ అమలు అంటూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కోపోద్రిక్తులైన కార్మిక నాయకులు మధ్యాహ్నం అడ్మిన్ బిల్డింగ్‌లోని డైరెక్టర్ చాంబర్‌కు వెళ్లారు. అక్కడ బయోమెట్రిక్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో అక్కడే బైఠాయించారు. ఈ విషయం తెలిసిన కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉక్కు అడ్మిన్‌కు చేరుకుంది. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని గేటు వద్ద అడ్డుకున్నారు. కార్మికులు అడ్మిన్ గేటు వద్ద బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గేటు బయట, డైరెక్టర్ చాంబర్ వద్ద నిరసన కొనసాగుతోంది. అర్ధరాత్రి దాటే వరకు డైరెక్టర్ చాంబర్‌లోనే కార్మిక నేతలు నిరసన వ్యక్తం చేశారు. వీరికి నైట్ షిఫ్ట్ కార్మికులు మద్దతు పలికారు. డైరెక్టర్ చాంబర్ సమీపంలో భారీగా గుమిగూడారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, జి. గణపతిరెడ్డి, బీఎంకే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విక్రాంత్.. విక్రమాదిత్య విశాఖ



ఐఎన్ఎస్ విక్రాంత్‌పై జరిగిన ముగింపు వేడుకల్లో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

- ఈ మూడు భారత దేశ అద్భుతాలే..
- వివిధ దేశాల ప్రతినిధులు ప్రశంసలు
- ఘనంగా మిలాన్–2024 ముగింపు వేడుకలు
- విక్రాంత్ యుద్ధ విమాన వాహక నౌకపై వీడ్కోలు సమావేశం

సాక్షి, విశాఖపట్నం : భారత నౌకాదళానికి యుద్ధ విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ఎంత విలువైనవో.. తూర్పు తీరానికి విశాఖపట్నం నగరం అంతే విలువైందని.. వివిధ దేశాల ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. విశాఖ వేదికగా.. ఈ నెల 19 నుంచి కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ సహకారంతో భారత నౌకాదళం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్–2024 వేడుకలు మంగళవారం ముగిశాయి. 51 దేశాలు పాల్గొనగా.. మిలాన్ చరిత్రలో ఇదే అతి పెద్దదిగా రికార్డు నెలకొల్పింది. సీ ఫేజ్ విన్యాసాలు చివరి రోజున.. విశాఖ సముద్ర జలాల్లో ఒళ్లు గగుర్పొడిచేలా యుద్ధ విన్యాసాలు నిర్వహించారు. భారత్‌కు చెందిన యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, యుద్ధ నౌకలు సహా 35 యూనిట్స్ ఈ విన్యాసాల్లో పాల్గొనగా.. వివిధ దేశాలకు చెందిన 13 యుద్ధ నౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్ కూడా భాగస్వామ్యమయ్యాయి. భారత నౌకాదళానికి చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ షిప్స్ ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. షిప్‌ని ఆక్రమించుకున్న సముద్రపు దొంగల బారి నుంచి ఎలా రక్షించాలనే అంశాలపై జరిగిన విన్యాసాలు హైలెట్‌గా నిలిచాయి. సముద్ర ఉపరితలంలో మిసైల్స్, గన్ ఫైరింగ్‌లు, యాంటీ–ఎయిర్ షూట్‌లు, ఇండియన్ నేవీ సబ్‌మెరైన్‌లతో అధునాతన యాంటీ–సబ్‌మెరైన్ వార్‌ఫేర్ విన్యాసాలు, ఫైటర్‌లకు వ్యతిరేకంగా వాయు రక్షణ దళాల విన్యాసాలు, ప్రయాణించే షిప్‌పై హెలికాప్టర్‌ల ల్యాండింగ్ తదితర కార్యకలాపాలతో పాటు ఇండియన్ నేవీ ట్యాంకర్ల నుంచి ఇంధనం నింపడం వంటి సీమాన్‌షిప్ విన్యాసాలు జరిగాయి. మిలాన్ ముగింపు వేడుకల్ని ఐఎన్ఎస్ విక్రాంత్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌పై నిర్వహించారు. వివిధ దేశాల కమాండింగ్ అధికారులు తుది సమావేశంలో పాల్గొన్నారు. విశాఖ నగరం అద్భుతంగా ఆతిథ్యమిచ్చిందని పలు దేశాల ప్రతినిధులు కొనియాడారని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.



సీ ఫేజ్ విన్యాసాలు

ఏసీలో కూర్చుని సీట్లు కేటాయిస్తే ఎలా?

- మద్దతు ఇచ్చేందుకు టీడీపీ శ్రేణుల ససేమిరా



టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రాము

అనకాపల్లి: స్థానిక నేతలతో మాట్లాడకుండా ఏసీ రూమ్‌ల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కూర్చొని సీట్లు ప్రకటిస్తే తాము మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని టీడీపీ కార్యకర్తలు ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. స్థానిక గవరపాలెం పీలా పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు పి.రాము మాట్లాడుతూ చంద్రబాబు లేనిపోని సర్వేలతో 1, 2, 3, 4 నంబర్లు బటన్ నొక్కాలని చెప్పిన రోజులు మరిచిపోయారా అని ప్రశ్నించారు. సర్వేల్లో భాగంగా అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ ఏ నంబర్‌తో కేటాయించారో తక్షణమే నియోజకవర్గ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మరో ఐదేళ్లపాటు నష్టపోయి టీడీపీలో ఉండాలంటే నియోజకవర్గ కార్యకర్తలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. గెలిచే అభ్యర్థికి కాకుండా మరో వ్యక్తికి టికెట్ ఇవ్వడం వల్ల తాము మద్దతు ఇవ్వడానికి మనస్సు అంగీకరించడం లేదన్నారు. మునగపాక మండలం నాగులాపల్లిలో శంఖారావం సభలో లోకేష్ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పీలాను చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. పీలా సీటు కోసం విశాఖ ఉమ్మడి జిల్లాలో టీడీపీ సీనియర్ నాయకులు పునరాలోచన చేయాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో పార్టీ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. జనసేన పార్టీకి సీటు ఇచ్చే సమయంలో స్థానికుల అభిప్రాయాలను తెలుసుకోవాల్సిన బాధ్యత చంద్రబాబుకు లేదా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో పీలా చెప్పులు అరిగిపోయే విధంగా గ్రామాల్లో తిరిగి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తే, కొత్తగా వచ్చిన వ్యక్తులకు సీటు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళీ, బొద్దపు ప్రసాద్, కోలారపు త్రినాథరావు, సబ్బవరపు గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో సారా బట్టీలపై విస్తృత దాడులు

- 1,900 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం
- 2 లీటర్ల సారాతోపాటు ఒకరి అరెస్టు



సారా బట్టీల వద్ద స్వాధీనం చేసుకున్న సామగ్రితో డీఎస్పీ సుబ్బరాజు, సీఐలు, పోలీస్ సిబ్బంది

దేవరాపల్లి: మండలంలో సారా బట్టీలపై డీఎస్పీ వి. సుబ్బరాజు నేతృత్వంలో పోలీసులు మంగళవారం విస్తృత దాడులు నిర్వహించారు. వాలాబు, రైవాడ పంచాయతీల్లో సారా బట్టీలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి మెరుపు దాడులు చేశారు. 1,900 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. వాలాబు పంచాయతీ శివారు పూలగరువులో 300 లీటర్లు, రైవాడ పంచాయతీ పరిధి రైవాడ జలాశయం సమీపంలో 1,600 లీటర్లు బెల్లం పులుపును ధ్వంసం చేశారు. బెల్లం పులుపు తయారీకి వినియోగించిన ప్లాస్టిక్ డ్రమ్‌లు, సిల్వర్ పాత్రలు తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వాలాబుకు చెందిన ఇ. దేముడు ఇంట్లో రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం డీఎస్పీ వి. సుబ్బరాజు గ్రామస్తులతో మాట్లాడుతూ సారా తయారీ సహా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని గ్రామస్తులకు సూచించారు. ఈ దాడుల్లో కె.కోటపాడు, చోడవరం, కొత్తకోట సీఐలు స్వామి నాయుడు, బి. శ్రీనివాసరావు, అప్పలనాయుడు, ఎస్ఐ డి. నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బండరాళ్ల లారీ బోల్తా



బోల్తా పడిన బండరాళ్ల లారీ

రాంబిల్లి: మండలంలోని రాజుకోడూరు జంక్షన్ వద్ద మంగళవారం బండరాళ్ల లోడ్ లారీ బోల్తా పడింది. నేవల్ బేస్‌కు బండరాళ్లను తరలిస్తుండగా అదుపు తప్పి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మితిమీరిన బరువును తరలించడం, అమితవేగంతో ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. లారీ బోల్తాపై తమకు సమాచారం లేదని సీఐ లక్ష్మణరావు తెలిపారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

‘దర్జా’గా బతుకు..

- రెడీమేడ్‌తో పోటీపడలేక చితికిపోయిన దర్జీలు
- వారి కష్టాలను గుర్తించిన సీఎం జగన్
- ఏటా రూ.10 వేల సహాయం
- నేడు మాడుగులలో దర్జీల దినోత్సవం



మాడుగులలో దర్జీ వృత్తిలో కొనసాగుతున్న సీనియర్ దర్జీ రమణ

మాడుగుల: రెడీమేడ్ దుస్తులకు ఆదరణ పెరిగి దివాలా అంచున చేరిన దర్జీలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఊపిరిలూదారు. అరకొర సంపాదనతో వృత్తిని విడిచిపెట్టలేక ఇతర పనులు చేయలేక అర్ధాకలితో జీవనం సాగిస్తున్న వీరికి ఏటా రూ.10 వేల సాయమందిస్తూ బాసటగా నిలిచారు. తన సుదీర్ఘ పాదయాత్రలో వీరి కష్టాలను తెలుసుకుని ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ఏటా నగదు సాయమందిస్తున్నారు. దీంతో ఈ వృత్తి నుంచి దూరమవుదామని అనుకునే వారంతా యథావిధిగా కొనసాగుతున్నారు. గతంలో జిల్లాలో ఐదు వేల కుటుంబాలు దర్జీ వృత్తిలో ఉండేవి. గత ప్రభుత్వాలు వీరిని పట్టించుకున్న పాపానపోలేదు. కనీసం రాయితీ రుణాలు, ఇతర సాయం అందకపోవడంతో ఆర్థికంగా కుదేలయ్యాయి. దీంతోపాటు నాణ్యతతో దుస్తులు కుట్టినప్పటికీ రెడీమేడ్ దుస్తులతో పోటీపడలేక దర్జీల సంఖ్య 1800 మందికి తగ్గిపోయింది. వీరిలో 800 మంది 50 ఏళ్ల దాటినవారు కావడంతో రానున్న కాలంలో దర్జీ వృత్తి కనుమరుగయ్యే అవకాశం లేకపోలేదు.

దర్జీల దినోత్సవానికి ఏర్పాట్లు

ఏటా ఫిబ్రవరి 28న మాడుగులలో దర్జీలు సంఘం మండలాధ్యక్షుడు బొమ్మిన నాగేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు వి. రమణ, ఉపాధ్యక్షుడు చంటిల ఆధ్వర్యంలో దర్జీలు దినోత్సవం నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

దర్జీలను ఆదుకున్న దేవుడు జగన్



గతంలో దర్జీలను ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఈ వృత్తిలో బతకలేక ఇతర వృత్తుల్లోకి వెళ్లిపోదామనుకున్నాం. రెడీమేడ్ దుస్తులు రాజ్యమేలుతుండడంతో మాకు పని లేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితిలో మా దర్జీలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి గుర్తించారు. అర్హత ఉంటే చాలు ఏటా రూ.10 వేలు మా బ్యాంకు ఖాతాకు జమ చేసి ఆదుకోవడంతో మరలా వృత్తిలో కొనసాగాలని ఆసక్తి వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–రాఖీ శ్రీను, సీనియర్ దర్జీ, మాడుగుల

అంగరంగ వైభవంగా మోదకొండమ్మ తీర్థం

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం, వాలీబాల్ పోటీలు



మోదకొండమ్మను దర్శించుకున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇక్కడ అమ్మవారిని దర్శించుకోవడానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారి ఆలయం నుంచి సతకంపట్టు వరకు కళ్లు మిరిమిట్లు గొలిపే విధంగా భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. రంగులు రాట్నాలు, బొమ్మలుకొలువు తీర్థంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం, వాలీబాల్ పోటీలను ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు ప్రారంభించారు. ఈ పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెరుమళ్ల వెంకటరావు, ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజారామ్, ఆలయ చైర్మన్ అప్పలరాజు



జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల విజేతతో ఆలయ కమిటీ చైర్మన్ అప్పలరాజు తదితరులు

పలురైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: బ్రహ్మపూర్ – నౌపడ సెక్షన్ పరిధిలో నిర్మిస్తున్న లిమిటెడ్ హైట్ సబ్‌వే పనుల నిమిత్తం ఈ మార్గంలో గురువారం ట్రాఫిక్ కం పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున పలు రైళ్లు రీ షెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు.

- భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 3.20గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా 4.45గంటలక బయల్దేరుతుంది. హౌరాలో ఉదయం 8.35గంటలకు బయల్దేరాల్సిన హౌరా–సికింద్రాబాద్ (12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ గంట పది నిమిషాలు ఆలస్యంగా 9.45గంటలకు బయల్దేరుతుంది. భువనేశ్వర్‌లో మధ్యాహ్నం 12.10గంటలకు బయల్దేరాల్సిన భువనేశ్వర్–చెన్నై సెంట్రల్(12830) ఎక్స్‌ప్రెస్ ఐదున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.35గంటలకు బయల్దేరుతుంది. విశాఖలో మధ్యాహ్నం 3.30గంటలకు బయల్దేరాల్సిన విశాఖ–డిఘా (22874) ఎక్స్‌ప్రెస్ 1.45గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.15గంటలకు బయల్దేరుతుంది. విశాఖలో మధ్యాహ్నం 3గంటలకు బయల్దేరాల్సిన విశాఖ– బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా సాయంత్రం 5 గంటలకు బయల్దేరుతుంది.

పలు రైళ్ల నియంత్రణ...

ఈ పనుల నిమిత్తం కామాఖ్య–బెంగళూరు(12552) ఎక్స్‌ప్రెస్, ముంబయి – భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, విశాఖ–భువనేశ్వర్ (22802) ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు ఈ సెక్షన్ పరిధిలో గురువారం ఆయా స్టేషన్‌లలో 20 నుంచి 30 నిమిషాలు నియంత్రించనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలపారు.

యువతి కిడ్నాప్‌కు ఆటోడ్రైవర్ యత్నం

- ఆటో నుంచి దూకేసిన బాధితురాలు
- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- టూటౌన్ పోలీసుల అదుపులో డ్రైవర్



అల్లిపురం: ఓ యువతిని ఆటో డ్రైవర్ కిడ్నాప్‌కు యత్నించగా.. ఆమె భయపడి ఆటో నుంచి దూకేసింది. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. నక్కవానిపాలెంలోని క్రాంతినగర్‌కు చెందిన కె.లహరి దొండపర్తి రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూంలో పనిచేస్తోంది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దొండపర్తిలోని షోరూంకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఆటో దొండపర్తి వద్దకు చేరగా.. నిలుపదల చేయమని యువతి అడిగింది. అయితే డ్రైవర్ ఆటో ఆపకుండా రైల్వేస్టేషన్ వైపు వేగంగా వెళ్లడంతో యువతి కేకలు వేసింది. డీఆర్ఎం జంక్షన్ దాటి తర్వాత ఆటో నుంచి దూకేసింది. దీంతో ఆమెకు ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎంఎల్‌సీ కేసు నమోదు చేసిన పోలీసులు డ్రైవర్‌ను గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ కూండ్రపు శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. మంగళవారం కొత్తూరు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ వివరాల మేరకు... పెందుర్తి నుంచి కస్పూరుపాలేనికి లోడ్‌తో వెళ్తున్న లారీ జాతీయ రహదారి సమీపంలో అన్నపూర్ణ ఫంక్షన్ హాలు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శ్రీనివాసరావు కాలు విరిగిపోవడంతో స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ తరలించారు. లారీ డ్రైవర్ తమ్ముడు గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి నీరు లక్ష్యం



దేవరాపల్లిలో మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శివానంద్




వాలాబులో నీటి నాణ్యతను పర్యవేక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శివానంద్

- జిల్లాలో రూ.712 కోట్లతో జల జీవన్ మిషన్ పనులు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శివానంద్

దేవరాపల్లి: జిల్లాలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందించడమే లక్ష్యంగా జలజీవన్ మిషన్ పథకంలో రూ.712 కోట్లతో 2,087 వర్కులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.వి. శివానంద్ తెలిపారు. దేవరాపల్లిలో జల జీవన్ మిషన్ స్కీమ్‌లో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు నిమిత్తం నూతనంగా నిర్మిస్తున్న 1.50 లక్షల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులను క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఎం. తిరుపతినాయుడు, మాడుగుల డీఈఈ అల్లు సూర్యనారాయణ, ఏఈఈ కె. చంద్రశేఖర్‌రావులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. అంతకు ముందు వాలాబు పంచాయతీలోని శివారు గ్రామాలకు తాగునీరు అందించే సమగ్ర రక్షిత పథకం పనితీరు, నీటి నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఎస్ఈ శివానందం మాట్లాడుతూ 2087 పనులకుగాను ఇప్పటి వరకు రూ.585 కోట్లతో చేస్తున్న 1,745 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పక్కా నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఇంటికి కుళాయిలు, పైపులైన్ ఏర్పాటు, నూతన ట్యాంక్‌లు నిర్మాణం తదితర పనులు చేపడుతున్నామన్నారు. వేసవిలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

‘దిశ’ దివ్యాంగ సురక్షపై అవగాహన



దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీపీ రవిశంకర్


పెందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశ యాప్‌కు కొనసాగింపుగా దిశ దివ్యాంగ సురక్ష అందుబాటులోకి వచ్చిందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. దీనిపై ప్రతీ ఒక్కరికీ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని చెప్పారు. పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలోని ప్రియదర్శిని సర్వీస్ ఆర్గనైజేషన్ దివ్యాంగుల పాఠశాలను సీపీ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగ సురక్ష టోల్ ఫ్రీ నెంబర్ 73374 34422 ద్వారా దివ్యాంగులు ఆపదలో ఉన్నప్పుడు వీడియో కాల్, లేదా వీడియో సందేశంతో పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తామన్నారు. దివ్యాంగులు తమ సమస్యను ఎదుట వ్యక్తులకు నేరుగా చెప్పలేరు కాబట్టి సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణులతో కూడిన బృందాన్ని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగుల సమస్యల కోసం ప్రతీ నెల 2, 15వ తేదీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 73374 34422 నెంబర్‌లో సైన్ లాంగ్వేజ్ నిపుణురాలను అందుబాటులో ఉంచి దివ్యాంగుల సమస్యలపై తక్షణమే స్పందిస్తామని చెప్పారు. దిశ దివ్యాంగ సురక్ష కంట్రోల్ సెంటర్‌ను పర్యవేక్షించడానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని నియమిస్తామని చెప్పారు. పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులకు పలు అంశాలపై మెళకువలు చెప్పారు. సీపీ వెంట పలువురు పోలీస్ అధికారులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్ క్రీడామైదానంలో ఆరోగ్య సురక్ష నేడు

అనకాపల్లి : జీవీఎంసీ 82వ వార్డు పరిధిలో సచివాలయం14(పెదరెల్లి వీధి) ప్రజలకు స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైద్యశిబిరంలో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు, కంటి వైద్యుడు, గైనిక్ వైద్యురాలు, వైద్యసిబ్బంది పాల్గొంటారని తెలిపారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ముందులు అందజేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా నల్లమారమ్మ జాతర


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి : మండలంలో కొత్తూరు పంచాయతీ రామాపురం కాలనీలో నల్లమారమ్మ జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారు జామునుంచి కుటుంబ సమేతంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ప్రతినిధి శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రికి నేలవేషాలు, స్టేజ్‌ప్రోగ్రాంలు నిర్వహించి, మందుగుండు సామాగ్రిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

అనకాపల్లి : స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌కు మంగళవారం ఇంటర్మీడియట్ పరీక్ష పత్రాలు వచ్చినట్లు పట్టణ సీఐ జి.శంకరరావు చెప్పారు. పట్టణ పరిధిలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకూ ఇంటర్మీడియట్ పరీక్ష ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. స్టేషన్ ఆవరణలో పరీక్ష పత్రాలను భద్రపర్చడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఉపాధ్యాయులు పోలీస్‌బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తీసుకువెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ పరిధిలో తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,202 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,730	4,700
మొదటి రకం	3,580	4,370
రెండో రకం	3,440	3,900
మూడోరకం	3,310	3,470

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
సుందరంమాస్టర్	:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్	:	షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
నాగదీపం	:	వెంకటేశ్వర
------	:	శ్రీసత్య
హనుమాన్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 53 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-16 యూనిట్లు, బీ పాజిటివ్-25 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నిషన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 387 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 354 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

'నాడు-నేడు'తో పెరిగిన విద్యార్థుల హాజరు


నాడు నేడుతో సరికొత్త రూపంలో గురజాడనగర్ పాఠశాల


మౌలిక వసతులు సమకూరిన తరగతి గదుల్లో విద్యార్థులు

- భలే రుచి 'జగనన్న గోరుముద్ద'
- ఆధునిక హంగులతో తరగతి గదులు

తుమ్మపాల : రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు కొత్త జీవం పోసింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మౌలిక వసతుల కల్పనకు సీఎం.వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారు. దశాబ్దాల కాలంగా శిధిల భవనాలుగా ఉన్న పాఠశాలకు మరమ్మతులు చేసి, నూతన భవనాలు నిర్మించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చేసింది. సరికొత్త పాఠశాలలుగా మార్చేసింది.

ప్రభుత్వం విద్యావిధానంలో పెను మార్పులకు శ్రీకారం చుట్టి నూతన విద్యావిధానం అములు చేస్తోంది. ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 2019 నవంబర్ 14న నాడు-నేడు పథకాన్ని ప్రారంభించి పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును తగ్గించాలని ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది.

అన్ని స్కూళ్లలో మౌలిక సౌకర్యాలు ....

ప్రతి పాఠశాలలోను మనబడి నాడునేడు ద్వారా టాయిలెట్ల నిర్మాణం, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లతో విద్యుద్దీకరణ, తాగునీటి సరఫరా, విద్యార్థులు, సిబ్బంది కోసం ఫర్నిచర్, పాఠశాలకు పెయింటింగ్, పెద్ద, చిన్న మరమ్మతులు, ఆకుపచ్చ సుద్ద బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్స్, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కాంపౌండ్ గోడలు నిర్మించారు.


వడ్డిస్తున్న జగనన్న గోరుముద్ద వంటకం


భోజనం చేస్తున్న విద్యార్థులు (ఇన్‌సెట్) పులిహోరా, గుడ్డు, పచ్చడి

జగనన్న గోరుముద్ద భలే రుచి

పిల్లలకు ఇంట్లో సరైన భోజనం కూడా అందించలేని అనేక కుటుంబాలు ఉన్నాయి. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి రావడం పిల్లలకు సరైన భోజనం అందకపోవడాన్ని గమనించిన ప్రభుత్వం పౌష్టికాహారాన్ని నేరుగా పాఠశాలలకే పంపిస్తోంది.

జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రోజుకో మెనూ పెట్టి సరికొత్త రుచులతో భోజనం అందిస్తున్నారు.

జగనన్న గోరుముద్ద పథకం మెనూ

సోమవారం	- అన్నం, గుడ్డు కూర, చిక్కి
మంగళవారం	- పులిహోర, టమాటా పప్పు, ఉడికించిన గుడ్డు
బుధవారం	- వెజిటబుల్ రైస్, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కి
గురువారం	- కిచిడీ, టమాటా చట్నీ, ఉడకబెట్టిన గుడ్డు
శుక్రవారం	- బియ్యం, తోటకూర, ఉడకబెట్టిన గుడ్డు, చిక్కి
శనివారం	- అన్నం, సాంబార్, స్వీట్ పొంగల్

అన్ని సౌకర్యాలు సూపర్



నా పేరు పైల ధనుషా, నేను నాలుగో తరగతి చదువుతున్నాను. మా పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయి. మేము చదువుకునేందుకు పుస్తకాలతో పాటు యూనిఫాం, షూ, బ్యాగ్ అన్నీ ఇచ్చారు. మా క్లాస్‌లో బెంచీలతో పాటు లాకర్లు, ఫ్యాన్‌లు కూడా ఉన్నాయి. డిజిటల్ తరగతులు కూడా పెడుతున్నారు. ప్రతి రోజు గుడ్డు ఇస్తున్నారు, వారం రోజుల పాటు రోజుకో రకమైన భోజనం మాకు చాలా ఇష్టం... –పైల ధనుషా

పూర్తి స్థాయిలో మౌలిక వసతులు



పాఠశాలలో 1 నుంచి 5 వరకు తరగతుల్లో మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నారు. అందరికీ పోషకాలు కలిగిన జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ప్రతి రోజు కొత్త కొత్త వంటకాలతో విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. ముందు మేము తిని రుచి చూసిన తరువాతే పిల్లలకు భోజనం పంపిణీ జరుగుతుంది. ప్రభుత్వం మనబడి–నాడునేడు ద్వారా సుమారు రూ.20 లక్షలతో పాఠశాలల రూపురేఖలు మార్చింది. ఆహ్లాదకరమైన వాతావరణం మా పాఠశాల సొంతం. గతంలో సాంబారు, అన్నం మాత్రమే పెట్టేవారు. కానీ ఇప్పుడు సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తుండడంతో పిల్లలందరూ రెండు పూటలా పాఠశాలకు వస్తున్నారు. హాజరు శాతం పెరిగింది. పిల్లల సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది.

–హెచ్‌ఎం కె.వి.ఎల్.గణేష్

చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలి

అనకాపల్లి : ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉన్నట్లయితే రోడ్డు ప్రమాదాలను నిర్మూలించవచ్చని ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక గాంధీనగరం సరస్వతి విద్యాలయంలో చిన్నారులకు ట్రాఫిక్ రూల్స్‌పై మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని, విద్యార్థి దశనుంచి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించవలసిన బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఆయన కోరారు. పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లే సమయంలో ప్రత్యేక దృష్టిలో పాటు ట్రాఫిక్‌రూల్స్ పాటించే విధంగా చెప్పాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులకు హెల్మెట్‌లను స్థానిక హీరోగ్రూప్ యాజమాన్యం సహాయంలో ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రియేటివ్ కార్యదర్శి నాగేశ్వరరావు, విద్యాలయం ప్రిన్సిపాల్ మందపాటి రంగాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల హెల్మెట్‌తో ఎస్ఐ సోమశేఖర్

ఎనిమిది మందికి కంటి శస్త్రచికిత్సలు


కంటి ఆపరేషన్లు జరిగిన రోగులతో క్లబ్ అధ్యక్షుడు నాయుడు

అనకాపల్లి: స్థానిక రోటరీ కంటి ఆస్పత్రిలో ఎనిమిది మందికి డాక్టర్ కె.మల్లేశ్వరరావు మంగళవారం కంటి ఆపరేషన్లు చేశారు. సోమవారం ఆస్పత్రిలో జరిగిన కంటి వైద్య పరీక్షలకు 29 మంది హాజరుకాగా వారిలో ఎనిమిదికి నేత్ర శస్త్రచికిత్సలు అవసరం అయ్యాయని వైద్యులు చెప్పారు. వారికి మంగళవారం ఆపరేషన్ చేసి, ఐదు రోజులకు సరిపడా మందులు ఉచితంగా అందించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.జె.నాయుడు, రోగులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌ల దుర్వినియోగం తగదు

- అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి
- విద్యార్థులకు పరవాడ డీఎస్పీ సత్యనారాయణ హితవు

యలమంచిలి : విద్యార్థికి బాల్యదశ ఎంతో కీలకమైనదని పరవాడ డీఎస్పీ సత్యనారాయణ అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీలో రైల్వేస్టేషన్ రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు భద్రత పరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలని , సెల్‌ఫోన్‌లను విజ్ఞానానికి, కమ్యూనికేషన్‌కు మాత్రమే వినియోగించాలని, చెడు నడవడికలకు దూరంగా ఉండాలని దురలవాట్లకు లోనుకాకుండా చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవాలని సూచించారు. నేరచరితులుగా మారకుండా మంచి ఉన్నతమైన స్థానాల్లో ఉండేలా ప్రణాళికలు రుచించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలకు రక్షణ కల్పించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు, ఎంఈవో మీనాక్షి, ఇన్‌చార్జి హెచ్ ఎం శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో ఉద్యాన పంటల సాగు

మునగపాక : ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగు కూడా చేపట్టవచ్చని డ్వామా పీడీ ఇ.సందీప్ తెలిపారు. ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మునగపాక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా అంతరపంటల సాగు కూడా చేపట్టవచ్చన్నారు. ప్రస్తుతం చెరకు ద్వారా ఆశించిన ఆదాయం రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అయితే వారిని ప్రోత్సహించేందుకు అంతర పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. రహదారులు, చెరువులు, కాలువల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ సందీప్

ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో జరిగే పనులను ఎప్పటికపుడు పర్యవేక్షించాలన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, తహసీల్దార్ పాపారావు, ఎంపీడీవో మన్మథరావు, ఏపీవో ఎరకయ్య, పలువురు ప్రజా ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

15 వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించండి

పాయకరావుపేట : గ్రామాల్లో 15 వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ఈవోఆర్‌డీ సిహెచ్ చంద్రశేఖర్ ఆదేశాలు జారీ చేసారు. గ్రామాల్లో ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ చేసిన వారికి వలంటీ ర్లు ఈకెవైసీ తీసుకోవాలని ఆదేశించడం జరిగిందన్నారు. నెట్ కెప్ పెండింగ్ బిల్లులు పరిష్కరించాలని ఆయన కోరారు. అదే విధంగా గ్రామాల్లో కార్యదర్శులు పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శుల కు సూచనలు అందించినట్లు ఆయన తెలిపా రు. అదే విధంగా గ్రామ సచివాలయాల్లో పెండింగ్ పనులు లేకుండా ఎప్పటికప్పుడు ప్రజల కు సమస్యలు పరిష్కరించాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ తెలిపారు.

కోడి పందాలపై కేసు నమోదు

అనకాపల్లి : కోడిపందాలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను, రెండు కోడిపుంజులను, రూ.1,250 నగదును స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ మంగళవారం చెప్పారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలివి. ముందస్తు సమాచారం మేరకు కోడిపందాలు ఆడుతున్న వ్యక్తులపై దాడి చేసి పట్టుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

కశింకోట : మండలంలోని విసన్నపేట గ్రామంలోని పాన్ దుకాణంలో విక్రయానికి మంగళవారం అక్రమంగా తరలిస్తున్న పది బ్రాందీ క్వార్టర్ సీసాలను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా దుకాణం నిర్వాహకుడు జి. రామును అరెస్టు చేశామన్నారు.

జోరుగా సిమెంటు రోడ్ల నిర్మాణం


కశింకోటలోని గవరపేట మధ్య వీధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

కశింకోట : కశింకోట పంచాయతీ పరిధిలో అడుగడుగునా సిమెంటు రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. స్థానిక గవరపేటలోని మధ్య వీధి, ఉప్పునీటిదిబ్బ ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్ల నిర్మాణం పూర్తి అయింది. కనకమహాలక్ష్మి వీధి, మేదర వీధి, రౌతు వీధి, అమరపల్లి వీధి ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. ఇవి పూర్తి అయితే గ్రామానికి నూతన శోభ సంతరించుకోనుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీసీలకు ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించాలి

తుమ్మపాల : బీసీలకు ఉద్యోగాలు, రాజకీయాల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొణతాల చంద్రశేఖర్ అన్నారు. ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ సమావేశం పట్టణంలో కొణతాల మహేశ్వరరావు కాంప్లెక్స్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 137 బీసీ కులాల న్యాయమైన డిమాండ్లను అన్ని రాజకీయా పార్టీలు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బుద్ధ భూలోకనాయుడు, కోశాధికారి పెంటకోట వెంకటశివ అప్పారావు, ఉపాధ్యక్షులు కోటా సూర్యనారాయణశాస్త్రి, పిట్ల రాజు, సహాయ కార్యదర్శులు మళ్ల జగన్‌మోహనరావు, మళ్ల ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి భీశెట్టి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు తాటిపూడి గోవింద, కొణతాల మహలక్ష్మినాయుడు. పట్నాల సురేష్, తగరంపూడి సర్వింగరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు బుద్ధ చంద్రవాణి పాల్గొన్నారు.

సచివాలయ ఎనర్జీ ఉద్యోగుల గౌరవాధ్యక్షునిగా దొరబాబు

అనకాపల్లి: జిల్లా గ్రామ/వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షునిగా రాజాన దొరబాబు ఏకాగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా కె.రమేష్, వర్కింగ్ అధ్యక్షునిగా జి.శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జి.సన్యాసినాయుడు, కోశాధికారిగా వై.గణేష్ ఎన్నికయ్యారు. పై కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు ఉంటుందని దొరబాబు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కశింకోట: తాళ్లపాలెం వద్ద మంగళవారం రాత్రి బైక్ ఢీకొని మహిళ మృతి చెందింది. ఎస్ఐ రమేష్‌బాబు అందించిన వివరాల ప్రకారం.. తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారి దాటుతున్న అదే గ్రామానికి చెందిన కర్రి సూకరత్నం (43)ను యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడటంతో 108లో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త సూకినాయుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి


కశింకోట మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కలగా లక్ష్మి ఆదేశించారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ మండల గ్రామాల్లో వేసవిలో తాగునీటి కొరత రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అర్హులైన వారికి డీఫారం పట్టాలివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యాన వన శాఖాధికారి లావణ్య మాట్లాడుతూ జీడిమామిడి, మామిడి, కొబ్బరి, నిమ్మ మొక్కలను తమ శాఖ ద్వారా రాయితీపై అందిస్తున్నామన్నారు. పామాయిల్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తుందని, మండలంలో 40 ఎకరాలోల పామాయిల్ తోటలు సాగవుతున్నాయన్నారు. హౌసింగ్ ఏఈ వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో 1027 ఇళ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు మిగిలిన ఇళ్లను పూర్తి చేయాలన్నారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ 1537 స్వయం సహాయక సంఘాలకు చివరి విడతగా సుమారు రూ.13 కోట్ల వైఎస్సార్ ఆసరా రుణ మాఫీ చెల్లించామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సత్యవతి మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉండి చదువుతున్న టెన్త్ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివిస్తున్నామన్నారు. పౌర సరఫరాల శాఖ, అటవీ, కార్మిక శాఖ తదితర అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. వైఎస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీడీవో శేషుబాబు, ఈఒఆర్‌డి సోమరాజు, ఆర్ఐ శ్రీకన్య, ఎంపీటీసీ సభ్యులు మంగతాయారు, హేమలత, చెవ్వేటి చంద్రమ్మ, గంగా భవాని, ఏపీఎం శివ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ పావని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది సమస్యలపై డీఆర్వోకు వినతి


డీఆర్వో దయానిధికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధి హామీ సిబ్బంది

తుమ్మపాల: ఉపాధి హామీ పథకంలో వివిద విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి గ్రేడ్ ఫిక్స్ చేయడం లో అన్యాయం జరుగుతుందని, వారంలో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, డ్వామా పీడీ సందీప్‌కు ఉద్యోగుల జేఏసీ మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ ఐకాస నాయకులు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ అర్హతతో డీఎస్సీ ద్వారా రోస్టర్ ప్రకారం నియమితులై 18 ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లకు గ్రేడ్‌లు, కేడర్ ఫిక్స్ చేయడంలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సిబ్బందికి మూల వేతనం రూ.13వేలు మాత్రమేనని, తమకి గ్రేడ్ ఫిక్స్ చేశాకే ,అన్ని ప్రభుత్వ శాఖలలో అమలు చేసినట్లుగా 23 శాతం పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. ఒప్పంద ఉద్యోగులను ఎఫ్‌టీఈ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు గొర్రెపాటి రవిచంద్ర, దాసరి కొండాజీ, శివాని, దేవకీ టి. సతీష్ కుమార్, కె .శ్రీనువాసరావు, దశరథ్‌రామ్, రాజేష్ పాల్గొన్నారు.

8న వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ అమ్మవారి కల్యాణం

అనకాపల్లి: మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 30వ ఆరాధన, మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు పట్టణ కార్పెంటర్స్ సంఘం అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక గవరపాలెం కామాక్షమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో మంగళవారం 30వ ఆరాధన కరపత్రికలను ఆవిష్కరించి మాట్లాడారు. మార్చి 6 నుంచి 9వ తేదీ వరకూ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 30వ ఆరాధన ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మార్చి 8న మహాశివరాత్రిని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో కామాక్షమ్మ అమ్మవారి ఆలయం నుంచి విజయరామరాజుపేట రైల్వే అండ్ బ్రిడ్జి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వరకూ చేరుకుంటుందని, ఆదేరోజు రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మార్చి 9 న వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబలకు కుంకుమ పూజలు నిర్వహించి, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం చేపడుతున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.


కల్యాణ కరపత్రికలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఖాళీ దుకాణాలకు 1న వేలం

అనకాపల్లి: జీవీఎంసీ పరిధిలో ఖాళీ దుకాణాలకు స్థానిక జోనల్ కార్యాలయంలో మార్చి 1 బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు జెడ్సీ ఒమ్మి అయ్యప్ప నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జోన్ పరిధిలో జనరల్ ఏరియా, హోల్ సేల్ మార్కెట్, చేపలు మార్కెట్, చెట్లఫలసాయం, గజెట్ నందు పేర్కొన్న ఖాళీ షాపులు ఏడాది పాటు అద్దెకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వడం జరుగుతుందన్నారు.

మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం, కశింకోట

రేఖా నెం. 01/2024/PS, తేది: 28-02-2024

బహిరంగ వేలములు మరియు టెండర్లు నోటీసు

అనకాపల్లి జిల్లా, కశింకోట మండలము, కశింకోట గ్రామ పంచాయతీకి చెందిన 2024-2025 నం. **తే॥ 01.04.2024ది** నుండి **తే॥ 31.03.2025ది** వరకు బహిరంగ వేలములు నిర్వహణ మరియు టెండర్లు స్వీకరణ ఈ దిగువ I, II షెడ్యూల్స్ నందు వివరించబడిన వివరములు ప్రకారము జరుపబడును. షెడ్యూల్ I నందలి వివరములు గల బహిరంగ వేలములు **తే॥ 05.03.2024ది, మంగళవారము ఉదయము 11:00 గంటల** నుండి ఈ దిగువ సంతకము దారునిచే కశింకోట మండలము ఇ.ఓ. (పి.ఆర్.&ఆర్.డి.) వారి సమక్షమున నిర్వహించబడును. వేలము పాటలో పాల్గొనువారు షెడ్యూల్ I నందు చూపబడిన ఐటమ్‌లకు ధరావత్తులు చెల్లించి సాల్వెన్సీ ధృవపత్రము దఖలుపర్చవలెను. షెడ్యూల్ II నందు వివరములు ప్రకారము సప్లైకు ధరావత్తులు చెల్లించి టెండరు దఖలు చేయుటకు టెండర్లు **తే॥ 06.03.2024ది బుధవారము ఉదయము 11.00 గంటల నుండి మధ్యాహ్నం 02.00 గంటల వరకు** స్వీకరించబడి అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండరుదారుల సమక్షమున తెరువబడును.

షెడ్యూల్ -I తేది: 05.03.2024 మంగళవారం

వ. నెం.	పాట వివరములు 2024-2025 (తే॥ 01.04.2024 ది నుండి తే॥ 31.03.2025ది వరకు) సం॥మునకు	ధరావత్తులు నగదు/ డి.డి. రూపములో	సాల్వెన్సీ మాత్రమే విలువ రూ.
1.	రోజువారి మార్కెట్ మరియు ఆశీలు వసూలు చేసుకొను హక్కు	50,000/-	1,00,000/-
2.	గురువారము వారపు సంత నందు ఆశీలు వసూలు చేసుకొను హక్కు	50,000/-	1,00,000/-

(వ నెం 1 మరియు 2 పాటలకు సాల్వెన్సీ ధృవపత్రము శ్రీ తహశీల్దార్ వారిచే తే॥ 01.01.2024ది తదుపరి జారీచేయబడినది అయి ఉండవలెను.)

షెడ్యూల్ -II తేది: 06.03.2024 బుధవారము

వ. నెం.	సప్లయి వివరములు 2024-2025 (తే॥ 01.04.2024ది నుండి తే॥ 31.03.2025ది వరకు) సం॥మునకు	ధరావత్తులు రూ. లలో
1.	గ్రామములో పారిశుధ్యము పనులకు 35 మంది (35 మంది పనివారు పేర్లతో సహా టెండర్‌లో వేయవలెను) అనుభవం గల పనివారల సప్లయి (ట్రాక్టర్ డ్రైవర్లు -3)	20,000/-
2.	మంచినీటి సరఫరా పనులకు ఐదుగురు (5) (5 మంది పనివారు పేర్లతో సహా టెండర్‌లో వేయవలెను) అనుభవము గల పనివారల సప్లయి చేయుటకు	10,000/-
3.	పి.హెచ్. సామగ్రి - ఫినాయిలు, బ్లీచింగ్, సున్నము, ML అయిలు సప్లయి మరియు సామగ్రి లిస్టు దాఖలు సరఫరా చేయుటకు	5,000/-
4.	మంచినీటి సరఫరా పైపులు మరియు సామగ్రి లిస్టు దాఖలు సరఫరా చేయుటకు	5,000/-

షరతులు :

I. షెడ్యూల్ I నందలి పాల్గొనువారు బహిరంగ వేలములో పాల్గొని పాట పాడిన పిదప హెచ్చు పాటదారుడు సగ మొత్తము గ్రామ పంచాయతీ కార్యాలయములో చెల్లించి తగు రశీదు పొందిన తదుపరి మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనవలెను.
II. తే॥ 01.04.2024ది నుండి తే॥ 31.03.2025ది వరకు మధ్య కాలములో ఎటువంటి ప్రకృతి వైపరీత్యములకు గాని, మరే ఇతర నష్టములకు గాని గ్రామ పంచాయతీలకు ఎటువంటి సంబంధం లేదు. పూర్తి భాధ్యత గుత్తేదారే వహించవలెను.
III. షెడ్యూల్ I నందలి బహిరంగ వేలములు, షెడ్యూల్ II నందలి టెండర్లు సంబంధించిన షరతులు, ఇతర వివరములు కార్యాలయము పనివేళల యందు తెలుసుకొనవలెను. బహిరంగ వేలములు, టెండర్లు స్వీకరణ వాయిదా వేయు అధికారము ఈ దిగువ సంతకముదారునికి కలదు. బహిరంగ వేలములు, టెండర్లు గ్రామ పంచాయతీ వారి అనుమతి పొందిన తదుపరి ఖాయపర్చబడును.
IV. రూ. 100/-లు వంద రూపాయలు అగ్రిమెంట్ పేపర్ (బాండ్ పేపర్)తో వేలము పాట నందు పాల్గొనవలెను.
V. గ్రామ పంచాయతీకి ఏవిధమైన బకాయిలు ఉన్నవారు పైన తెల్పిన వివరములలో వేలములో పాల్గొనుటకు అనర్హులు.

సం/- **నల్లాన రమేష్,** పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ - కశింకోట